క్లుప్తంగా

ఆయిల్‌పామ్ సాగుకు రాయితీలు

గోకవరం: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తోందని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్ పామ్ కంపెనీ డీజీఎం ప్రకాష్ అన్నారు. రంపయర్రంపాలెం గ్రామంలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు ఆయిల్‌పామ్ తోటల ప్రాముఖ్యత, పంట సాగులో ఎరువులు యాజమాన్యం వంటి వాటి గురించి అవగాహన కల్పించారు. అలాగే ఆయిల్‌పామ్ సాగుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న ప్రోత్సాహకాలు, సూక్ష్మ సేద్యంలో ఇస్తున్న రాయితీలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పామ్‌ఆయిల్ రైతులు పాల్గొన్నారు.

వ్యాన్, లారీ, బస్ ఢీ
ఐదుగురికి స్వల్పగాయాలు

తుని రూరల్: తుని మండలం తేటగుంట సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను లారీ ఢీకొంది. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి యాత్రికులతో కాశి వెళుతున్న బస్‌ను లారీ ఢీకొంది. ఈ సంఘటనలో బస్‌లో ఉన్న ఐదుగురు యాత్రికులకు సల్పగాయాలు అయినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. మంగళవారం ఈ సంఘటన జరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూరల్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

డిగ్రీ కాలేజీలో నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుని రూరల్: వి.కొత్తూరులోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఈనెల 18న ఎంఎస్సీ విద్యార్థులకు చైతన్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ లలిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, కెమిస్ట్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ బోధించుటకు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్సీలో కెమిస్ట్రీ చదివి ఉండాలన్నారు. ఎస్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో ఈనెల 19న ఇంటర్వ్యూకు హాజరుకావలన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 15 మందికి శిక్ష

జగ్గంపేట: స్థానిక పోలీసు సర్కిల్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపే 15 మందిని కోర్టుకు హాజరుపరచగా 11 మందికి జరిమానా, నలుగురికి జైలు శిక్షను న్యాయస్థానం విధించింది. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం 11 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు, నలుగురికి 2 రోజుల పాటు జైలుశిక్ష విధించినట్టు వివరించారు.

చర్యలు తీసుకోవాలి

రౌతులపూడి: గిడజాం గ్రామంలో కొండను కొల్లగొట్టి ఒక మతానికి చెందిన వారు ప్రార్థనలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు కూడా దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రమణ మహర్షి జయంతి



గోకవరంలో రమణ మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: భగవాన్ రమణ మహర్షి జయంతిని గోకవరంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో భక్తులు రమణ మహర్షి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు. విశేష సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



తొండంగిలోని కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ బుల్లిబాబు

తొండంగి: రబీలో అపరాలు, వరిసాగు చేసే రైతులు కొద్ది పాటి మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడుల సాధించవచ్చని ఏడీఏ సుంకర బుల్లిబాబు అన్నారు. మంగళవారం తొండంగిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ పంటల పూర్తికావడంతో రబీలో అపరాలు, వ్యవసాయబోర్ల పరిధిలో వరిసాగు చేసే రైతుల కోసం రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

గండేపల్లి: మండలంలోని యర్రంపాలెం, సూరంపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సద్గురుమూర్తి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ బాబా, వీఏఏ సుమిత్ర, రైతులు పాల్గొన్నారు.

కూరగాయల సాగు బాగు బాగు

- పత్తి, వరి కంటే ఎక్కువ ఆదాయం
- అందుబాటులో రైతు బజారు
- ఉద్యానశాఖ ప్రోత్సాహకాలు

తుని : సంప్రదాయ పంటలను నమ్ముకున్న రైతులు మిశ్రమ పంటల వైపు దృష్టి సారించారు. ఒకే పంటను వేయడంతో ఆర్థికంగా నష్టాలను చవిచూస్తున్నారు. మారుతున్న ఆధునిక వ్యవసాయానికి అనుగుణంగా రైతులు పంటమార్పిడికి ప్రాధాన్యమిస్తున్నారు. మెట్ట ప్రాంతంలోని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో వరి తర్వాత కూరగాయాల సాగుకు ఆకర్షితులవుతున్నారు. ఇందుకు ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న ప్రోత్సకాలు, కూరగాయాలకు డిమాండ్ ఉండడంతో ఎక్కువ మంది సాగుకు సన్నద్ధమయ్యారు. దీంతో సీజన్‌లో సన్నకారు రైతులు 887 ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రాధాన్యమిచ్చారు. ఉన్నటివంటి భూమిలో ఒకే పంటకు బదులు ఎక్కువ రకాలను సాగు చేస్తున్నారు. దీంతో పాటు కొంత మంది రైతులు అంతర పంటగా కూరగాయల పంటను వేసి మంచి దిగుబడిని సాధిస్తున్నారు.

ఏడాది పొడవునా ఆదాయం

మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల కూరగాయలను అన్ని సీజన్లలోను పండించడం ద్వారా ఏడాది పొడుగునా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. బోరు బావులకు అవసరం మేరకు విద్యుత్ వినియోగించి దిగుబడులను సాధిస్తున్నారు. రైతులు రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్నారు.



రౌతులపూడి మండలంలో సాగు చేసిన తీగ జాతి పంట

సాగు పద్ధతి

మెట్ట ప్రాంతమైన మూడు నియోజకవర్గాల్లో వర్షాధార భూములు ఎక్కువ. బోరుబావుల ఉన్న ప్రాంతాల్లో కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. గతంలో ఒకే పంటను వేయడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపాయేవారు. ఈ విధానానికి స్వస్తి పలికి మిశ్రమ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఎకరా భూమిలో నాలుగు నుంచి ఆరు రకాల పంటలను వేస్తున్నారు. భూమిని చిన్న చిన్న మడులుగా తయారు చేసి వాటిలో వంగ, బెండ, బీర, కాకర, ఆనభ, టమాట, తోటకూర, పాలకూర, గోంగూర, మెంతుకూర, మిరప, కూర బొబ్బర తదితర రకాల పంటలను వేస్తున్నారు. విత్తనాలు ఎంపిక నుంచి ఎరువులు, నీటి యాజమాన్యం వరకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పంట మార్పిడి విధానం పాటించడం వల్ల చీడ, పీడలు తగ్గడంతో పాటు దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంటుంది. ఎకరాకు రూ.30 వేలు వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఏడాదికి రూ.90 వేల వరకు ఆదాయం తీస్తున్నారు.

నియోజకవర్గం	కూరగాయల సాగు విస్తీర్ణం ఎకరాలు
తుని	360
ప్రత్తిపాడు	270
జగ్గంపేట	157

అందుబాటులో రైతు బజారులు

తుని మండలంలో చామవరం, వల్లూరు, కుమ్మరిలోవ, వి.కొత్తూరు, తాళ్లూరు, కొలిమేరు, రేఖవానిపాలెం, మరువాడ, నందివొంపు, దొండవాక, కెఓ మల్లవరం లోవకొత్తూరు, వల్లూరు తదితర గ్రామాల్లో పండించిన కూరగాయలను తుని మార్కెట్ యార్డుకు తీసుకువస్తున్నారు. రైతు బజారులో నేరుగా రైతులే అమ్ముకుంటున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోళ్లు చేసి ఎగుమతులు చేస్తున్నారు. జగ్గంపేట రైతులు రాజమహేంద్రవరం, ప్రత్తిపాడు నియోజకరవ్గం పరిధిలోని రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన రైతులు విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

ఉద్యాన శాఖ రాయితీలు



కాయగూరల పంటలు సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీ పై విత్తనాలు అందిస్తున్నాం. బోరు బావి సదుపాయం ఉన్న రైతులకు డ్రిప్ ను ఏర్పాటు చేసుకోవడానికి 90 శాతం రాయితీని ప్రభుత్వ అందిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో కూరగాయల సాగు లాభదాయకం. మార్కెట్‌లో రాబోయే మూడు నెలల్లో మంచి డిమాండ్ ఉంటుంది. రైతులు ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

–ఎం.విజయలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, తుని

కొనసాగుతున్న కార్మికుల ఆందోళనలు



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట గ్రామంలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల ఆందోళనలు మంగళవారం కొనసాగాయి. ఐలాజ్(ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ శిబిరం వద్దకు చేరుకుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తక్షణమే కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నేరవేర్చాలన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిచి, ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

సుస్థిర ప్రణాళికతో సమగ్రాభివృద్ధి



సర్పంచ్‌లకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శివాజీ



ఏలేశ్వరంలో గాంధీజీ, అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాల వేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ తదితరులు

తుని రూరల్: సుస్థిరమైన ప్రణాళికతో స్థిరమైన సమగ్రాభివృద్ధి లక్ష్యాలను సమైఖ్యంగా సాధించాలని ఎంపీడీఓ కె.సాయినవీన్ అన్నారు. మంగళవారం తుని మండల పరిషత్ కార్యాలయం, మండల విద్యా వనరుల కేంద్రంలో సర్పంచులు, గ్రామ సచివాలయ సిబ్బందికి, గృహ నిర్మాణ, స్త్రీ శిశు సంక్షేమ అధికారులకు 2025–26 కార్యచరణ ప్రణాళిక, సుస్థిరమైన సమగ్ర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ రెండు రోజులపాటు ఉంటుందని ఆయన తెలిపారు. అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రతినిధులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీపీ డాక్టర్ బి.రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామీణ తాగునీ రు, పారిశుధ్య నిర్వహణ డీఈఈ ఎ.శివాజీ, ఐసీడీఎస్ సీడీపీఓ కె.శ్రీలత, ఈఓపీఆర్‌డీ మరిడియ్య పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థాయికరించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనేక అంశంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో మంగళవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతుల్లో సర్పంచులు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. వీరికి పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన గ్రామం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, గ్రామంలో మంచినీరు, క్లీన్ అండ్ గ్రీన్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సూర్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులు ప్రారంభించారు.

శంఖవరం: గ్రామాల్లో మౌళిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సుస్థిర అభివృద్ధిపై సర్పంచులకు, కార్యదర్శులకు, సచివాలయం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ముందుగా ఎంపీపీ, ఈటీసీ సామర్లకోట ప్రిన్సిపాల్ వేణు గోపాల్, ఎంపీడీఓ ఎస్ఎస్ శర్మ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజల్వన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీడీపీఓ పద్మావతి,ఏఓ పి.గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: పటిష్ఠ ప్రణాళికతో గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ శివరామకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతులను మంగళవారం ప్రారంభించారు. మండల అధికారులు, గ్రామ సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: శిక్షణా తరగతులను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.హరికృష్ణ తెలిపారు. స్థానిక సత్యదేవా కళ్యాణ మండపంలో గ్రామాల అభివృద్ధిపై మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎన్.సత్యప్రసాద్, ఏఓ జోకా అమృత, ఏపీఎం ఎస్ వేదకుమారి, సిబ్బంది ఉన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీఓ నాతి బుజ్జి మాట్లాడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శ్రీయుత ఏపీఎసై ఆర్డీ పరిశీలకులు శ్రీనివాసరావు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేద ప్రజలకు మేలు



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీతోనే పేద ప్రజలకు మేలు చేకూరుతుందని ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు అన్నారు. ధర్మవరంలో మంగళవారం ఆయన పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన బొమ్మిడాల రాము, ఆర్ఎంపీ వైద్యుడు బ్రహ్మాజీ భార్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిని మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జువ్వల దొరబాబు, పోకనాటి వెంకన్న, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ తదితరులు ఉన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న ఎన్‌డీఏ కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న బంగార్రాజు

ప్రత్తిపాడు: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి, కార్మిక కోడ్లను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ బీజేపీ, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు ఆరోపించారు. ప్రత్తిపాడు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో మంగళవారం ఏఐసీసీటీయూ జిల్లా కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బుగత బంగార్రాజు మాట్లాడుతూ జనవరి 26 నుంచి దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కార్మిక హక్కులను, రాజ్యాంగ హక్కులను కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్–మోదీ దాడి కొనసాగుతోందని, ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదమని హెచ్చరించారు. ఏఐసీసీటీయూ రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నంలో జనవరి 28న జరిగే రాష్ట్ర మహాసభను, ఢిల్లీలో ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు జరిగే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యకర్తల సమావేశం పిలుపు నిచ్చింది. ఈ సమావేశంలో ఏఐసీసీటీయూ జిల్లా నాయకురాలు పేరూరి లక్ష్మి, ఊబా జార్జి, ఆయర్లా జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు, కె.లోవరాజు, పెద్దిపాలెం మాజీ ఎంపీటీసీ భూముల నూకాలమ్మ, ఎం బూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిష్పక్షపాతంగా ప్రణాళికలు



ప్రత్తిపాడులో ప్రసంగిస్తున్న ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధికి నిష్పక్షపాతంగా ప్రణాళికలు రూపొందించాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 'లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎల్ఎస్‌డీజీ),' 2025–26 ఆర్థిక సంవత్సరానికి గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనుల ప్రణాళిక తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వ్యవసాయ, గృహ నిర్మాణ, వైద్య, విద్యశాఖ అధికారులు హాజరయ్యారు. గ్రామాల్లో సర్వే నిర్వహించడం ద్వారా అభివృద్ధి, వసతుల కల్పనకు నిర్దుష్ట ప్రణాళిక రూపొందించాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు కోరారు. తహసీల్దార్ ఎం .సూర్యప్రభ, ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. తొలుత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీపీ, ఎంపీడీఓలు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఓమెన్ హెడ్‌కానిస్టేబుల్ చక్రవేణి తెలిపారు. ఆమె తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 15న చిల్లంగి వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన ఆవుల కాపరి పనికి రాలేదు. దీంతో ఆలయ కమిటీ సభ్యులు అదే గ్రామానికి చెందిన తరిపల్లి వీరబాబు(49)ను ఆవులు కాసేందుకు పిలిచారు. వీరబాబు ఆవును మేపడానికి తాడువిప్పుతుండగా ఆవు గట్టిగలాగడంతో కింద పడిపోయాడు. తలకు పెద్ద గాయమైంది. అతడి స్థానిక ఆర్ఎంపీకి చూపించుకుని యథావిధిగా పనికి వెళ్లాడు. తల తిరిగి కింద పడిపోడంతో మృతుడు భార్య ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలిచారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయాడు. మృతుడు భార్య అచ్యుతాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిట్టు చక్రవేణి తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

కిర్లంపూడి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని బీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గెద్దనాపల్లి, భూపాలపట్నం గ్రామాల్లోని తహసీల్దార్ జె.చిరంజీవి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలు భూసమస్యలకు చెందిన 8 అర్జీలు రైతుల నుంచి స్వీకరించినట్లు చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే ఉప తహసీల్దార్ అర్.శ్రావణి, ఎంఎల్ఎస్ఓ షేక్ బషీర్, ఆర్ఐ సత్యదేవి, సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

ఆరేడేళ్లుగా మూలుగుతున్న డప్పులు



మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న డప్పులు, ఇతర పరికరాలు

తుని రూరల్: ఎస్సీ కళాకారులకు అందాల్సిన డప్పులు, ఇతర పరికరాలు ఆరేడేళ్లుగా మండల పరిషత్ కార్యాలయంలో మూలుగుతున్నాయి. 2014–19 మధ్య ప్రభుత్వం 2019 ఎన్నికల ముందు తాయిలాలుగా అందించేందుకు 2018 ఆఖరిలో రూ.లక్షలు విలువైన డప్పులను కొనుగోలు చేసి మండల పరిషత్ కార్యాలయానికి పంపించింది. లబ్ధిదారుల జాబితా పంపించకపోవడంతో ఎవరికి ఇవ్వాలో తెలియని అధికారులు వీటన్నింటిని ఒక గదిలో భద్రపర్చారు. తర్వాత ఎన్నికల్లో ప్రభుత్వం తలకిందులవడం, డప్పులు ఉన్నాయన్న విషయం తెలియకపోవడంతో ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదు. ఈ రోజు గది ఖాళీ చేస్తుండగా డప్పులు తదితర పరికరాలు బయటపడ్డాయి. ఈ పరికరాలలో కొన్ని తుప్పు పట్టగా మరికొన్ని బూజు పట్టి ఉన్నాయి. ఇప్పటికైన లబ్ధిదారులను ఎంపిక చేసి అందజేస్తే డప్పు కళాకారులకు కొంతమేరకు ప్రయోజనం చేకూరుతుంది.

ఘనంగా ప్రపంచ పెన్షనర్ల దినోత్సవం



ఏలేశ్వరంలో గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజును సన్మానిస్తున్న సంఘనాయకులు



తునిలో పెన్షనర్లను సత్కరిస్తున్న ట్రెజరీ అధికారి బాలచందర్, మాధవరావు



జగ్గంపేటలో పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: ప్రపంచ పెన్షనర్స్ దినోత్సవ వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మండల పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ కార్యాలయం వద్ద వేడుకలు జరిగాయి. పెన్షన్ పితామహులు డీఎస్ నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరిసోమరాజును సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

తుని: ఉద్యోగ విరమణ తర్వాత ఆనందంగా గడపాలని తుని ట్రెజరీ అధికారి కె.బాలచందర్ పెన్షనర్స్‌కు సూచించారు. మంగళవారం కొత్తపేటలోని కార్యాలయంలో పెన్షనర్స్ దినోత్సవాన్ని తుని శాఖ అధ్యక్షుడు పి.మాధవరావు అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగులకు పెన్షన్ తీసుకురావడానికి కృషి చేసిన డి.సి.నకరా, జాతిపిత మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన 15 మందిని ట్రెజరీ అధికారి బాలచందర్ సత్కరించారు. అసోషియేషన్ తుని శాఖ ఉపాధ్యక్షుడు ఆంజనేయప్రసాద్, సీతారామరాజు, చింతకాయల అప్పలకొండ, త్రిమూర్తులు, కృష్ణ, డేనియల్ జోసఫ్, అప్పలస్వామి, కుక్కుటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. మండల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, తహసీల్దార్ ఎం సూర్యప్రభ, సబ్ ట్రెజరీ అధికారి ఎస్‌కే సలీం హాజరయ్యారు. విశ్రాంత ఉద్యోగులు జి వేణుగోపాలాచార్యులు, జి.లక్ష్మణాచార్యులు, శింగిలిదేవి అప్పారావు, జి.అన్నపూర్ణ, తేజోమూర్తుల సత్యనారాయణ మూర్తి, బి.పెద్దబ్బాయిలను పూలమాలలతో సత్కరించి, శాలువాలతో సన్మానించారు. విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు జంధ్యం సుబ్బారావు, ఎం సుబ్రహ్మణ్యం , ఎ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, జగ్గంపేట ఎస్‌బీఐ మేనజర్ శ్రీనివాస్, జగ్గంపేట ట్రెజరీ ఆఫీసర్ జహీరుద్దీన్, మండల విద్యాధికారి ఆర్.స్వామి విచ్చేసి మాట్లాడారు. వారు డీఎస్ నకరా చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం 75 సంవత్సరాలు దాటిని పెన్షనర్లు డి.రామలింగేశ్వరరావు, కోనబాబూరావు, ఎస్.ఆదినారాయణ, విజయలక్ష్మి, డి.వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

అన్నవరం: పెన్షనర్స్ అసోసియేషన్ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ శ్రీరామచంద్రమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుని సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్‌టీఓ) ఎస్.బాలచందర్, గ్రామ సర్పంచ్ కుమార్‌రాజా, సీనియర్ పెన్షనర్లు జి.రామచంద్రరావు, వరాహమూర్తి, మైలవరపు సత్యనారాయణ, నాగరాజు, అలీషాను ఘనంగా సన్మానించారు. పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పి.సత్యనారాయణ రాజు, ఏఎంఎస్‌వీ రాజు, ఎన్ నరశింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఎక్కడ..?



సీసీరోడ్డు ప్రారంభోత్సవంలో శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యనమల దివ్య

తొండంగి: స్థానిక కృష్ణాలయం వీధిలో కూటమి ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డును ఎమ్మెల్యే యనమల దివ్య మంగళవారం ప్రారంభించిన శిలాఫలకంలో ప్రొటోకాల్ పాటించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా రూ.8 లక్షల నిధులతో కృష్ణాలయం వీధిలో సీసీ రోడ్డు నిర్మించారు. ఈ ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్ ఫొటోలు గానీ, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పేర్లు గానీ లేవు. కేవలం కూటమి పార్టీల నాయకుల పేర్లు మాత్రమే వేశారు. దీంతో పలువురు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు ఏమైనా చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.

కనకదుర్గమ్మ జాతర ప్రారంభం
అమ్మవారికి అర్ధరాత్రి నైవేద్యం సమర్పణ

గండేపల్లి: మురారి మామిడి తోటల్లో వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ జాతరను మంగళవారం అర్ధరాత్రి 1.10 గంటల సమయంలో క్షీరాన్నం, బూర్లు, అన్నాన్ని కుంభంగా ఉంచి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి జాతరను ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఏడాదిలానే ఈ సంవత్సరం కూడా తదియ గడియల్లో ప్రారంభిస్తున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ నేడు జరగనున్న జాతరకు ముగ్గురు ఎస్సైలు, 40 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్టు తెలియజేశారు.